ప్రజాశక్తి
ఆదివారం 23 జులై 2023 5
శ్రీ సత్యసాయి

సైకిల్ చక్రంతో కలుపుతీస్తున్న రైతు నాగరాజు

మడకశిర టిడిపిలో ముసలం

◆ ఈరన్న, తిప్పేస్వామిల మధ్య పెరిగిన గ్రూపు తగాదాలు

◆ పరిశీలకుడు సైతం పట్టించుకోవడం లేదని ఈరన్న ఆరోపణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మడకశిర నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీలో అంతర్గతంగా కొనసాగుతున్న గ్రూపు రాజకీయాలు ఇప్పుడు తెరపైకి వచ్చేశాయి. మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్నల మధ్య పోరు బాహాటంగానే సాగుతోంది. ఎస్సీ రిజర్వు నియోజకవర్గమైన మడకశిరలో ఇద్దరు నేతల మధ్య సాగుతున్న పోరు క్షేత్ర స్థాయి కార్యకర్తల్లో ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఘోర ఓటమిని చవిచూసినా నేతలు గుణపాఠాలు నేర్వలేదన్న విమర్శలను సొంత పార్టీ నేతలే చేస్తుండటం గమనార్హం. శనివారం నాడు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాజీ ఎమ్మెల్యే ఈరన్న కొన్ని ఆరోపణలు చేయడం చర్చనీయాంశం అవుతున్నాయి. మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి తనను అణచివేసే చర్యలు చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా నియోజకవర్గ పరిశీలకుడిగా వచ్చిన పార్థసారథి రెడ్డి సైతం తనను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తన అనుయాయుల ద్వారా ఎమ్మెల్యే తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఈ అంశంతో ఇద్దరి మధ్య పోరు బాహాటమైనట్లయింది. వాస్తవానికి తిప్పేస్వామి, ఈరన్నల మధ్య ముందునుంచి గ్రూపు తగాదాలు నడుస్తున్నాయి. ఈరన్న ముందు నుంచి తెలుగుదేశం పార్టీలో ఉండగా తిప్పేస్వామి 2014లో రాష్ట్ర విభజన అనంతరం కాంగ్రెసు పార్టీ దెబ్బతిన్నాక తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్సీగానూ పనిచేస్తూ వచ్చారు. ఈయనకు ముందు నుంచి మడకశిర నియోజకవర్గంపై మంచి పట్టుంది. 2009 నియోజకవర్గాల పునర్విభజన వరకు ఈ నియోజకవర్గం నుంచి రఘువీరారెడ్డి కాంగ్రెసు తరుపున బరిలో ఉండేవారు. అప్పుడు ఆయన అనుయాయుడిగా తిప్పేస్వామికి ఈ నియోజకవర్గంపై మంచి పట్టుంది. ఆ తరువాత 2009లో ఎస్సీకి రిజర్వు అయ్యాక కాంగ్రెసు పార్టీ తరుపున సుధాకర్ గెలుపొందారు. ఆయనున్నా తిప్పేస్వామే ముఖ్యమైన వ్యవహారాలు చక్కబెట్టేవారు. అయితే 2014లో రాష్ట్రం విడిపోయాక కాంగ్రెస్ దెబ్బతిన్నాక తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆ ఎన్నికల్లో అక్కడ ఈరన్న గెలుపొందారు. ఈరన్న ముందు నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులుగా ఉంటూ వచ్చారు. పార్టీలో సౌమ్యుడిగా ముద్ర ఉంది. తొలిసారిగా ఆయన పోటీ చేసి గెలుపొందారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన తిప్పేస్వామి, కొత్తగా ఎమ్మెల్యే అయిన ఈరన్నల మధ్య సఖ్యత కుదరలేదు. నియోజకవర్గంపై మాట చెల్లుబాటు విషయాల్లో తేడాలొస్తూనే ఉన్నాయి. ఇవి 2019 ఎన్నికల్లోనూ స్పష్టంగా కనిపించింది. ఆ ఎన్నికల్లో పార్టీ ఓటమి తరువాతనైనా ఇద్దరి మధ్య సఖ్యత కుదిరి పార్టీ అభివృద్ధి పనిచేస్తారని ఆ పార్టీ శ్రేణులు భావించాయి. ఎందుకంటే ఎస్సీ రిజర్వు నియోజకర్గం కావడంతో టిక్కెట్టు అక్కడ ఆశించడానికి తిప్పేస్వామికి వీల్లేదు. ఈ నేపథ్యంలో ఆయన ఈరన్నను కలుపుకుని ముందుకు పోతారని భావించారు. కాని అటువంటిది జరగకపోగా మరింతగా విభేదాలు పెరుగుతుండటం చర్చనీయాంశం అవుతున్నాయి. ఒకవైపు అధికార పార్టీ ఎమ్మెల్యే తిప్పేస్వామిపై ఆ పార్టీలోనే తీవ్రమైన వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ దాన్ని సద్వినియోగం చేసుకునే స్థితిలో తెలుగుదేశం పార్టీలో లేదన్న అభిప్రాయం ఆ పార్టీ వర్గాల నుంచే వ్యక్తమవుతోంది. వ్యక్తిగతమైన ప్రతిష్టల వల్ల వచ్చే అవకాశాన్ని జారవిడుచకునే విధంగా టిడిపి ఇద్దరు నేతలు వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులే బాహాటంగా చెబుతుండటం గమనార్హం.

సైకిల్ చక్రం..కలుపుతీత యంత్రం..!

యువ రైతు వినూత్న ఆలోచన

ఖరీఫ్ ప్రారంభం నుంచి సరైన వర్షాలు లేక అరకొర వానలకు వేసిన కొద్దిపాటి పంటను కాపాడుకోవడం రైతులకు తలకుమించిన సమస్యగా మారింది. దుక్కులు, ఎరువులు, విత్తనాల ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పంటలో పడ్డ కలుపు(పిచ్చి మొక్కలు) తొలిగింపు కూలి ఖర్చులు రైతులకు తలకుమించిన భారం అవుతోంది. ఇలాంటి పరిస్థితిలో ఓ యువ రైతు వినూత్నంగా ఆలోచించాడు. చిలమత్తూరు మండలం వీరాపురం పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన నాగరాజు అనే రైతు మూడు ఎకరాల్లో వేరుశనగ, మొక్కజొన్నను సాగు చేశాడు. ఇటీవల పొలంలో కలుపు ఎక్కువ కావడంతో దాని తొలగింపునకు కూలి ఖర్చులు అధికం అయ్యాయి. దీంతో ఆయన పాడై పోయిన ఓ సైకిల్‌ను కలుపు తీసే యంత్రంగా మార్చుకున్నాడు. కలుపును తొలిగించే గూటువలను సైకిల్ చక్రానికి జతచేసి ఒక్కడే కలుపు తీసే కార్యక్రమం చేపట్టాడు. దీనిని చూసిన తోటి రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కలుపు తొలగింపునకు రైతు తయారు చేసిన యంత్రం బాగా ఉందని తోటి రైతులు తెలిపారు.

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-కనగానపల్లి

బాధిత రైతుకుటుంబంతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

అప్పులబాధ తాళలేక మండల పరిధిలోని చంద్రాచర్ల గ్రామంలో ఈనెల 20వ తేదీన ఆత్మహత్య చేసుకున్న రైతు కత్తి సూర్యానారాయణ కుటుంబాన్నీ ఏపీ రైతుసంఘం నాయకులు శనివారం పరామర్శించారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాల పల్లి పెద్దన్న, కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి బత్తల కదిరప్పలు బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కత్తి సూర్యనారాయణకు ప్రయివేటు, బ్యాంకులలో దాదాపు రూ.10 లక్షల రుపాయలు పైబడి అప్పులు ఉన్నాయన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతుకు ప్రవేటు వ్యక్తుల నుంచి అప్పులు కట్టాలని ఒత్తిడి పెరగడానికి తోడు గంతిమర్రి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 214-3లో 4.41 ఎకరాలను గతంలో ప్రభుత్వం పట్టా ఇచ్చిందన్నారు. పట్టా ఇచ్చినప్పటికి ఆన్లైన్, పాస్‌బుక్‌లు ఉన్నాయన్నారు. ఇటీవల కుర్లపల్లి గ్రామానికి చెందిన రెడ్డి సామాజికవర్గం చెందిన వ్యక్తి సూర్యనారాయణ భూమిని దౌర్జన్యంగా సాగుచేస్తున్నాడని చెప్పారు. దీనిపై సూర్యనారాయణ కుటుంబం న్యాయం చేయాలని అధికారులు, ప్రభుత్వ పెద్దల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారన్నారు. అయినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. అప్పులు బాధలు, భూమి తగాదా సమస్యలతో మానసిక ఒత్తిడికి గురైన సూర్యనారాయణ ఆత్మహత్య చేసుకుని మరణించాడని చెప్పారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

వేరుశనగ సాగుకు నెలాఖరు వరకు అనుకూలం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలో వేరుశనగ సాగు చేయడానికి ఈనెలాఖరు వరకు సమయం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. పుట్టపర్తి మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో శనివారం నాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం, జిల్లా వ్యవసాయ యంత్రాంగం సంయుక్తంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సంపత్ కుమార్, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త అధిపతి జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో సాగు అయిన పంటల విస్తీర్ణం ఇప్పటివరకు కేవలం 20 శాతం మాత్రమే ఉందన్నారు. రాబోయే రోజుల్లో వర్షపాతానికి అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను రూపొందించాలని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలకు సూచించారు. వ్యవసాయ పరిశోధన స్థానం కదిరి అధిపతి డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ వేరుశనగ సాగు చేసేందుకు జూలై 31 వరకు సమయం ఉందన్నారు. రాబోయే రోజుల్లో వాతావరణ సమాచారం దష్టిలో ఉంచుకుని రైతులు ఈనెలాఖరు లోపల వేరుశనగను విత్తుకోవచ్చునని తెలిపారు. ఆగస్టు 15వ తేదీ వరకు వర్షానికి అనుగుణంగా కంది, ఆముదం పంటలను కూడా వేసుకోవచ్చని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలైన రాగి, కొర్ర, జొన్న వంటి చిరుధాన్యాల పంటలను ఆగస్టు నెల నుంచి వేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. వీటితోపాటు పప్పుధాన్యాల పంటల్లో పెసర, ఉలవలు వంటి తక్కువ కాల పరిమితి కలిగిన పంటలను సెప్టెంబర్ వరకు వేసుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవికె.రెడ్డిపల్లి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ మల్లీశ్వరి, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రసన్న రాజేష్, డాక్టర్ వేమన, డాక్టర్ చెనరాయుడు, వ్యవసాయ అధికారులకు రాబోయే రోజుల్లో జిల్లాలోని పంటలలో తీసుకోవలసిన మెలకువలను వివరించారు.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం

హిందూపురం : విద్యార్థులు చక్కగా విద్యాభ్యాసం చేసి ఉన్నత స్థాయికి చేరుకోవడం వల్ల సమాజాభివద్ధి సాధ్యమవుతుందని న్యాయవాదులు పేర్కొన్నారు. శనివారం స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గహంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ వంటి బారినపడి వారి బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ వన్నెరప్ప, న్యాయవాదులు కళావతి, సంతోష్ కుమారి, నవేరా, లైజనింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, లోక్ అదాలత్ హేమావతి, వార్డెన్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఇళ్ల వద్దకే సేవలు : దీపిక

హిందూపురం : జగన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఇళ్ల వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తున్నట్లు వైసిపి సమన్వయకర్త దీపిక వేణురెడ్డి తెలిపారు. శనివారం హిందూపురం రూరల్ మండలం కొటిపి గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ గతంలో జన్మభూమి కమిటీల సిఫార్సు ఉంటేనే ప్రజలకు సేవలు అందేవన్నారు. అయితే జగనన్న పాలనలో ఇళ్లవద్దకే అన్ని రకాల సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయన్నారు. అనంతరం వివిధ ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరేంద్ర కుమార్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి హనుమంతరెడ్డి, శ్రీరామిరెడ్డి, సాదిక్ పాల్గొన్నారు.

రాజీమార్గంతో సత్వర పరిష్కారం : ఏడీజే

హిందూపురం : రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవడం వల్ల సత్వర న్యాయం కలుగుతుందని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ తెలిపారు. శనివారం స్థానిక అదనపు జిల్లా జడ్జి కోర్టు ఆవరణలో ప్రత్యేక లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీజే మాట్లాడుతూ లోక్‌అదాలత్‌తో కక్షిదారులకు ఎలాంటి ఖర్చులూ లేకుండా రాజీమార్గంలో కేసును పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నాగభూషణరావు, నాగరాజురెడ్డి, వన్నెరప్ప, సంతోషి కుమారి, నవేరా, రహమాన్, గోపాలకష్ణ, నాగప్ప, సుదర్శన్ పాల్గొన్నారు.

కేసు పరిష్కారం పై చర్చిస్తున్న ఏడిజె శైలజ

ఓటరు సర్వేను పూర్తి చేస్తాం

ధర్మవరం టౌన్ : ధర్మవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గల 287 పోలింగ్ కేంద్రాల్లో బిఎల్ఒలు, బిఎల్ఏల ఆధ్వర్యంలో అనుకున్న సమయానికి తప్పక పూర్తి చేస్తామని ఉప ఎన్నికల తహశీల్దార్ అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఆకస్మిక తనిఖీలను నిర్వహించి తగిన సూచనలు ఇచ్చారు. తొలుత బిఎల్ఒలు, బిఎల్ఎలకు సమావేశం ఏర్పాటు చేసి సర్వేలో విధివిధానాలను తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం క్షుణ్ణంగా ఓటరు జాబితా ప్రకారం ఇంట్లో ఎంత మంది ఓటర్లు ఉన్నారు? తొలగించడం ఏమైనా ఉన్నాయా? చేర్పులు మార్పులు ఉన్నాయా? అన్న ప్రతి అంశాన్ని వారు పరిశీలించారు. బిఎల్‌వోలకు ప్రతిరోజు 35 ఓటర్లను పరిశీలించేలా లక్ష్యాన్ని ఇచ్చారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ధర్మవరం టౌన్ : రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య తెలిపారు. శనివారం పట్టణంలోని 35వ వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు మిని మ్యానిఫెస్టో పథకాల గురించి ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాటమయ్య మాట్లాడుతూ టీడీపీ హయాంలో పేదలు సంతోషంగా ఉండేవారన్నారు. ఈ ప్రభుత్వంలో అన్ని ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అభివద్ధి శూన్యం అన్నారు. కుంటిసాకులతో అర్హులకు పథకాలు అందకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఫణికుమార్, పరిశేసుధాకర్, ' పురుషోత్తంగౌడ్, కొత్తపేట ఆది, నాగూర్ హుస్సేన్, తొగట నారాయణస్వామి, మునిస్వామి, చింతాలచ్చి, రామాంజినేయులు, వహీదా పాల్గొన్నారు.

విద్యార్థి భవిష్యత్తును మార్చేది ఉపాధ్యాయుడే

ధర్మవరం టౌన్ : విద్యార్థి భవిష్యత్తును మార్చేది ఉపాధ్యాయుడే అని, బోధనను నాణ్యతగా అందించి నప్పుడు మంచి గుర్తింపు లభిస్తుందని బత్తల పల్లి ఎంఇఒ సుధాకర్ నాయక్ తెలిపారు. ఇటీవల బదిలీపై బత్తలపల్లికి వెళ్లిన ఎంఇఒ సుధాకర్ నాయక్‌ను ఆత్మీయ వీడుకోలు కార్యక్రమాన్ని శనివారం నాడు పట్టణంలోని ఎంఇఒ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం అర్బన్, రూరల్, మున్సిపల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు-నేడు, అమ్మఒడి, జగనన్న విద్యాదీవన పథకాలు పూర్తి స్థాయిలో విజయవంతం చేయడంలో ఎంఇఒ సుధాకర్ నాయక్ కషి అభినందనీయం అన్నారు. సుధాకర్ నాయక్ మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో ముదిగుబ్బ, ధర్మవరం మండలాల ఎంఈవో విధులను నిర్వహించానని చెప్పారు. అనంతరం ఎంఈవో సుధాకర్ నాయక్‌ను స్థానిక ఎంఈవో లు గోపాల్ నాయక్, రాజేశ్వరి దేవి, ఏపీటీఎఫ్ నాయకులు బికె.ముత్యాలప్ప, రవీంద్ర రెడ్డి, జగదీష్‌లతోపాటు, ఉపాధ్యాయ బందం, ఎంఈవో కార్యాలయ సిబ్బంది పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

సుధాకర్ నాయక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ, విద్యాశాఖ బృందం

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

హిందూపురం : శ్రీకష్ణదేవరాయ విశ్వవిద్యాలయం శుక్రవారం విడుదల చేసిన డిగ్రీ మూడవ సెమిస్టర్ ఫలితాల్లో హిందూపురం ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు గత మార్చి నెలలో నిర్వహించిన మూడవ సెమిస్టర్ పరీక్షల్లో బీఎస్సీ 92 శాతం, బీకాం 80 శాతం, బిఎలో 75 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. జువాలజీ, పొలిటికల్ సైన్స్, ఉర్దూ సబ్జెక్టుల్లో 100 శాతం ఉత్తీర్ణత, బోటనీలో 94 శాతం, గణితం, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులలో 90 శాతం, కెమిస్ట్రీ 80 శాతం ఉత్తీర్ణత పొందినట్లు ఆమె వివరించారు. ఈ సంవత్సరం సింగిల్ మేజర్ డిగ్రీ కోర్సులు ప్రారంభించబోతున్న ఈ సబ్జెక్టులలో మంచి ఫలితాలు సాధించడం తమకు చాలా ఆనందంగా ఉందని తెలిపారు.

పురంలో దేవుని ఆస్తులకే శఠగోపం.!

◆ రూ.20 కోట్ల విలువజేసే దేవాదాయ భూమిపై వైసిపి నేతల కన్ను

◆ భూమిని కాపాడాలంటూ మీడియా ముందుకొచ్చిన ఆలయ ఈవో

కబ్జా చేయాలని ప్రయత్నం చేస్తున్న ఆలయ భూమి ఇదే ...

విలేకరులతో మాట్లాడుతున్న దేవాదాయ శాఖ ఈవో నాగేంద్రుడు

ప్రజాశక్తి-హిందూపురం

వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రోజురోజుకూ భూములకు రక్షణ కరువవుతోందనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేసేస్తున్నారు. హిందూపురంలో ఆలయ భూమిని కాజేసేందుకు వైసిపి నేతలు యత్నిస్తున్నారు. ఈ విషయాన్ని స్వయంగా ఆలయ ఈవో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సుమారు రూ.20 కోట్ల పైగా విలువగల ఈ భూమినీ నకిలీ డాక్యుమెంట్స్ సష్టించి కబ్జా చేశారు. జెసిబిల ద్వారా చదును చేయటానికి కబ్జాదారులు యత్నించగా దేవాదాయ శాఖ అధికారులు అడ్డుకోవడంతో వెనుకంజ వేశారు. కబ్జాదారులు వైసీపీ నాయకులు దేవుని భూమికి శఠగోపం పెడుతున్నారనీ భూమిక రక్షణ కల్పించాలంటూ శనివారం ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో దేవాదాయ శాఖ ఈఓ నాగేంద్రుడు వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే.. హిందూపురం పట్టణంలో అనంత పద్మనాభ స్వామి ఆలయానికి నానెప్ప ధారాదత్తం చేసిన భూమిని దేవాదాయ శాఖ సెక్షన్ 38 ప్రకారం 1956 రిజిస్టర్‌గా నమోదు చేశారు. ఈ భూమి హిందూపురం పట్టణం నివాస గహాల నడబొడ్డున సత్యనారాయణ పేటలో ఉంది. ప్రస్తుతం ఈ భూమి విలువ సుమారు రూ.20 కోట్లు పైగా ధర పలుకుతుంది. దీనిని కొంత మంది అసాంఘిక శక్తులు ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవానికి ఈ భూమి హిందూపురానికి చెందిన వైద్యుడు నానెప్పకు సంతానం లేకపోవటంతో తన చెల్లెలు కుమారులైన లోచర్ల గంగాధర శాస్త్రి, లోచర్ల చెన్నరాయశాస్త్రితో గతంలో ట్రస్ట్ ఏర్పాటు చేశారు. 130 సంవత్సరాల కింద స్థానిక సత్య నారాయణపేటలోని సర్వే నంబరు 29/ ఎం7లో ఉన్న 0.71 ఎకరాలు, సర్వేనంబరు 30/ ఎంలో ఉన్న 1.79 ఎకరాలు మొత్తం 2.50 ఎకరాల భూమిని లేపాక్షి రోడ్‌లోని ప్రసిద్ధి చెందిన అనంత పద్మనాభ స్వామి దేవాలయం నిర్వహణ, నిత్య కైంకార్యాలకు విరాళంగా ఇచ్చారు. అప్పటినుంచి ఈ భూమి దేవాదాయ శాఖ అధికారులు మూడు సంవత్సరాల కాలపరిమితికి బహిరంగ వేలం వేసి కౌలుదారులకు అందించి వచ్చే మొత్తాన్ని ఆలయానికి వెచ్చిస్తున్నారు. ప్రస్తుతం ఈ భూమిని కమలమ్మ, రెడ్డి కుమార్‌లకు కౌలుకు ఇచ్చారు. ఇలాంటి భూమిని కొందరు వైసిపి నేతలు కబ్జా చేయాలని చూస్తున్నారు. ఏకంగా భూమిని చదును చేసి ఆక్రమించేందుకు జెసిబిలతో వచ్చారు. ఈ భూమిని రక్షించాలని ఇప్పటికే ఆలయ అధికారులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆలయానికి సంబంధించిన ఈ భూమిన కాపాడేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చూడాలని ఈవో కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికే జగన్న సురక్ష

కలెక్టర్ అరుణ్‌బాబు

ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

ఎలాంటి సర్వీసు ఛార్జీలూ లేకుండా ఆయా గ్రామాల్లోనే ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం జగన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. శనివారం నాడు గోరంట్ల మండలంలోని మందలపల్లి గ్రామ సచివాలయం-1లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారులకు వివిధ ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లోనూ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన వివిధ సర్టిఫికెట్లను ఈ కార్యక్రమం ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 32 మండలాలు, 6 మున్సిపాల్టీలు ఉన్నాయని, 'జగనన్న సురక్ష'లో భాగంగా 38 కమిటీలు పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమం ప్రారంభమైన 20 రోజులు పూర్తయిందని, ఇప్పటి వరకూ 4,05,300 కుటుంబాలను సర్వే చేయగా 3.51 లక్షల మందికి సేవా సర్టిఫికెట్లు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఒ విజయ్‌కుమార్, తహశీల్దార్ రంగనాయకులు, పీవోఆర్డీ సుధాకర్, మందలపల్లి సర్పంచి ప్రమీలా ముసలిరెడ్డి, గడ్డంతండా సర్పంచి వాసుదేవ్ నాయక్, జవకులదిన్న సుబ్బారెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

కస్తూరిబా పాఠశాల తనిఖీ

గోరంట్ల మండల పరిధిలోని మందలపల్లి కస్తూరిబా గాంధీ పాఠశాలను కలెక్టర్ పి.అరుణ్ బాబు శనివారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. స్టాక్ రూములో నిలువ ఉంచిన సరుకులు, కూరగాయలను పరిశీలించారు. కోడిగుడ్లు అరటిపళ్లను ఎప్పటికప్పుడు తాజాగా అందించాలని నిర్వాహకులకు సూచించారు. తాజాగా ఉన్న కూరగాయలు మాత్రమే వాడాలని తెలిపారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో స్వయంగా ఆయనే పాఠ్యపుస్తకాల్లోని కొన్ని ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. భోజనం మెనూ ప్రకారం పెడుతున్నారా.? లేదా.? అన్న వివరాలను విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ కష్టపడి చదివితే మంచి విజయాలు సాధించవచ్చని తెలిపారు. బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చెప్పారు. కలెక్టర్ వెంట గోరంట్ల తహశీల్దార్ రంగనాయకులు, కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపల్ సిబ్బంది ఉన్నారు.

మణిపూర్ ఘటన కారకులపై చర్యలు తీసుకోవాలి

పెనుకొండలో నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

ఐద్వా జిల్లా గౌరవాధ్యక్షురాలు దిల్షాద్

ప్రజాశక్తి-పెనుకొండ

మణిపూర్‌లో మహిళల హింస ఘటన కారకులపై చర్యలు తీసుకోవాలని, మహిళలపై హింసను నివారించే చర్యలు తీసుకోవాలని ఐద్వా మహిళా సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు దిల్షాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి గౌతమి ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నేతృత్వంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి కార్యాలయ ఏఓకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దిల్షాద్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో చిన్నారులు, మహిళలపై రోజురోజుకూ హింస పెరుగుతోం దని, వాటిని నివారించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యా యన్నారు. నిర్భయ, దిశా చట్టాలపై ప్రచార ఆర్భాటం తప్ప అమలు పట్ల చిత్తశుద్ధి లేదని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి శ్రీదేవి, పెనుకొండ ప్రాజెక్టు కార్యదర్శి భావమ్మ, సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ హరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, తిప్పన్న, నాయకులు కొండా వెంకటేశులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రంగప్ప, ఐద్వా మహిళా సంఘం సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

హిందూపురం : మణిపూర్ విషయంలో ప్రధాని నరేంద్ర మోడీ మౌనం వీడి వెంటనే ఆ రాష్ట్ర ప్రభుత్వన్ని బర్తరఫ్‌కు సిఫార్సు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. మణిపూర్ ఆదివాసుల మహిళలపై దాడి చేస్తున్న బిజెపి విధానాలకు వ్యతిరేకంగా శనివారం సిపిఎం ఆధ్వర్యంలో సిఐటియు, కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్‌లో ఆందోళన చేసి, అక్కడి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ మణిపూర్ మారణహోమాన్ని ఆపాలని, కేంద్ర ప్రభుత్వం మౌనం వీడాలని, మహిళలపై అమానుషంగా దకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఆ ఘటనకు బాధ్యత వహిస్తూ అక్కడున్న ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, ఆయా సంఘాల నాయకులు రాము, రాజప్ప, జ్యోతమ్మ, నందీశ్వర, లక్ష్మీనారాయణరెడ్డి, రామకృష్ణ, నాగేష్, జశ్వంత్, మంజునాథ్ పాల్గొన్నారు.

గోరంట్ల రూరల్ : మణిపూర్ సంఘటనకు నైతిక బాధ్యత వహించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వారి పదవులకు రాజీనామా చేయాలని పెనుగొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పాలసముద్రం నరసింహులు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అత్యంత ధీరుడని చెప్పుకునే మోడీ పార్లమెంటులో ప్రతిపక్షాలు మణిపూర్ సంఘటనపై నిలదీస్తే సమాధానం చెప్పకుండా మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. దేశ ప్రజలకు, మహిళా లోకానికి ప్రధాని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో తక్షణం రాష్ట్రపతి పాలన విధించాలన్నారు.

సోమందేపల్లి : మణిపూర్‌లో మహిళలపై జరిగిన హింసాకాండ దారుణమని, ప్రతి ఒక్కరూ దీనిని ఖండించాల్సిన అవసరం ఉందని ఐద్వా నాయకులు తెలిపారు. మణిపూర్ మహిళలపై జరిగిన హింసాకాండకు కారకులైన వారిని శిక్షించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి గౌతమి, మండలాధ్యక్షులు లీలావతి మాట్లాడుతూ ప్రస్తుతం దేశం, రాష్ట్రంలో చిన్నారులు, మహిళలపై రోజురోజుకూ హింస పెరుగుతోందని చెప్పారు. ఇటీవల మణిపూర్ మహిళాపై జరిగిన దారుణకాండ సభ్యసమాజం సిగ్గుపడేలా ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నిర్లక్ష్యం వల్లే దేశంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. మణిపూర్ మారణకాండకు ప్రధాని బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కమిటీ సభ్యులు హేమలత, అనిత, నాగమణి, లలిత, గంగోత్రి, మంగమ్మ, రమీజా, సిపిఎం మండల కమిటీ సభ్యులు హనుమయ్య, శ్రీకాంత్, సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చేపల వల వేసేందుకు వెళ్లి వ్యక్తి మృతి

చిలమత్తూరు : మండల పరిధిలోని కోడికొండ పాతచెరువులో చేపలు పట్టేందుకు వల వేసేందుకు వెళ్లి తెప్ప తిరిగిపడి నీటిలో మునిగి ఒకరు మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. కోడికొండ గ్రామ పంచాయతీలోని బలిజపల్లి గ్రామానికి చెందిన బీటర్ నారాయణస్వామి(48) చేపలు పట్టేందుకు కోడికొండ పాత చెరువులో వల వేసేందుకు తెప్పలో వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తు తెప్ప బోల్తా పడటంతో నీట మునిగిన నారాయణస్వామి మృత్యువాత పడ్డాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు స్థానికుల సహాయంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు.

చిన్నారి కేసులో సవితి తండ్రి అరెస్టు

హిందూపురం : రూరల్ మండల పరిధిలోని కొటిపి పంచాయతీ బసవేశ్వర కాలనీలో చిన్నారిపై సవితి తండ్రి వాతలు పెట్టిన కేసును సీరియస్‌గా తీసుకున్న రూరల్ సిఐ కృష్ణారెడ్డి అంగన్‌వాడీ సిబ్బంది ఫిర్యాదుపై విచారణ చేసి సవితి తండ్రి మణికంఠను శనివారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎస్‌పి మాధవరెడ్డి తీవ్రంగా పరిగణించి వెంటనే అరెస్టు చేయాలని ఆదేశించారన్నారు. కేసుపై సమగ్ర విచారణ జరిపి కేసు నమోదు చేసి, ముద్దాయిని రిమాండ్‌కు తరలించామన్నారు.

సెబ్ అధికారుల విస్తృత దాడులు

మడకశిర : సెబ్ ఎఎస్పీ విష్ణు ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ పర్యవేక్షణలో శనివారం పట్టణంలో జరిపిన దాడుల్లో ఓ మట్కా కేసులో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి రూ. 20,520 స్వాధీనం చేసుకొని మడకశిర పోలీస్ స్టేషన్‌లో అప్పగించనట్లు సిఐ భార్గవరెడ్డి తెలిపారు. దాడుల్లో మడకశిర, పెనుకొండ సెబ్ సిఐలు భార్గవరెడ్డి, సుబ్బారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లసాల్మన్‌రాజ్, జనార్ధన్, వెంకటేష్, శివ, సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం లారీ పట్టివేత

అమరాపురం : అక్రమంగా బియ్యం తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు గుడిబండ ఇన్‌ఛార్జి ఎస్ఐ మునిప్రతాప్ శనివారం తెలిపారు. ఆంధ్ర బియ్యాన్ని లారీలో పావగడ నుంచి నాగేపల్లి గేటు, విరూపసముద్రం మీదుగా వి.అగ్రహారానికి అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో రెవెన్యూ అధికారులు, పోలీసుల సహకారంతో లారీని పట్టుకున్నారు. డ్రైవర్, క్లీనర్‌ను విచారించగా వారి వద్ద బియ్యంకు సంబంధించి ఎలాంటి బిల్లులు లేకపోవడంతో లారీని అమరాపురం స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం బియ్యం బస్తాలను మడకశిరలోని గొడౌన్‌లో అప్పజెప్పినట్లు తహశీల్దార్ దాసరి రమేష్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటింటి సర్వే పరిశీలన

హిందూపురం : పట్టణం, రూరల్ మండలంలో జరుగుతు న్న ఓటర్ల జాబితా సర్వేను శనివారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, తహశీల్దార్ హసీనాసుల్తాన తనిఖీ చేశారు. పట్టణం, రూరల్ మండల వ్యాప్తంగా నేటి నుంచి వచ్చే నెల 30 వరకు ఓటర్ల జాబితాపై ప్రభుత్వం నుంచి ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని బూత్ లెవల్ అధికారుల ద్వారా చేపట్టినట్లు తెలిపారు. అలాగే బూత్ లెవల్ అధికారులకు సూచనలు చేశారు. ఓటర్ల సర్వేకు వచ్చే బూత్‌లెవెల్ అధికారు లకు సహరించాలన్నారు. వీరి వెంట మున్సిపల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

12 లక్షల మొక్కల పంపిణీకి శ్రీకారం

డివిజనల్ ఫారెస్ట్ అధికారి శ్యామల

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఈ వర్షాకాలంలో 12 లక్షల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని డివిజనల్ ఫారెస్ట్ అధికారి శ్యామల తెలిపారు. పుట్టపర్తిలో శనివారం ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 14 నర్సరీలలో వివిధ రకాల మొక్కలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నర్సరీలలో పెంచిన మొక్కలను రైతులకు సబ్సిడీతో (రూ. 10 మొక్కను రూ.7కే) ఇస్తామన్నారు. ఎర్రచందనం, టేకు, కానుగ, వేప, చింత, సరుగుడు, సీమసింత, ఉసిరి, నేరేడు, బ్యాంబో, దానిమ్మ, మద్దిరావి, జామ, నిమ్మ, రోజ్‌వుడ్, బాదాం, ఖర్జూర, మునగ, గంగ రావి, సపోట, శ్రీగంధం, తదితర 44 రకాల మొక్కలు నర్సరీలలో లభ్యమవుతాయన్నారు. ఈ ప్రాంతం ఎర్రచందనం, టేకు, పెంచుకోవడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. ఎర్రచందనం మొక్కలను 20 ఏళ్లు సంరక్షిస్తే రైతులకు మంచి లాభసాటిగా ఉంటుందన్నారు. టేకు, శ్రీగంధం కూడా మంచి ధర పలుకుతోందన్నారు. ఎర్రచందనం, టేకు కనగానపల్లి, జీవన్‌పల్లి, సాహెబ్ చెరువు, బీడుపల్లి నర్సరీలలో ఈ ప్రాంతం వారికి లభ్యమవుతాయన్నారు. ఎర్రచందనం పెంచడానికి అనుమతులు అవసరం లేదని, అయితే వృక్షాలు కొట్టడానికి అనుమతి తప్పనిసరి అన్నారు. హెక్టార్‌కు 1100 మొక్కలు పెంచుకోవచ్చన్నారు. మొక్కలు తీసుకునే రైతులు డిడిలు కట్టి చలానా సమర్పించాలన్నారు. రైతులు తమకు కావాల్సిన మొక్కలు తీసుకెళ్లవచ్చన్నారు. పెనుకొండ, కదిరి ప్రాంతం వారు ఆ ప్రాంత నర్సరీలలో మొక్కలు పొందవచ్చన్నారు.

డిగ్రీ ఫలితాల్లో శ్రీసాయి విద్యార్థుల హవా

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

విజయకేతనం చూపిస్తున్న ప్రిన్సిపల్, విద్యార్థినులు

పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎస్కే యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ థర్డ్ సెమిస్టర్ ఫలితాల్లో సత్తా చాటారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ చాంద్‌బాషా, ప్రిన్సిపల్ ఫణికుమార్ మాట్లాడుతూ డిగ్రీ థర్డ్ సెమిస్టర్ ఫలితాల్లో పట్టణంలోనే ప్రథమ స్థానంలో నిలిచామని తెలిపారు. బీఎస్సీలో కె.స్వాతి 93శాతం, సి.సుమియా, పి.దీప్తి, ఎస్.ఫరిస్తాజ్, పి.జ్యోతి 92శాతం, జె.దివ్యశ్రీ, టి.పూజిత, కె.భారతి, ఎం.హేమ లత 91శాతం, దివ్యశ్రీ 90శాతం, డి.కుసుమ, జి.ఉష 89శాతం, సి.జయశ్రీ, సి.రేష్మ, ఎస్.సౌమ్య, జి.గౌతమి, ఎస్.మేఘన, ఎస్.జమీర్, యు.నందిని, వి.రుక్మిణి 87శాతం, బి.దుర్గాభవాని, బి.చరణ్ కుమార్ 86శాతం, ఎస్.చందు, కె.సునీత, పి.పావని, ఈ.భార్గవ్‌సాయి, ఎస్.మహేశ్వరి 84శాతం, ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి 83శాతం, జి.వైష్ణవి, జి.గాయత్రి 82శాతం, సి.జయంత, సి.ద్రాక్షాయిని 81శాతం, జి.సతీష్‌కుమార్ 80శాతం, బిబిఎ అండ్ బి కాంలో కె.కృష్ణవేణి 91శాతం, బి.సురేంద్ర, బి.రక్షిత 82శాతం, ఆర్.సాయికుమార్‌నాయక్ 81శాతం, వై.రజియా 79శాతం, ఎస్.రాజు, కె.హేమంత్‌కుమార్ 78శాతం, జి. ప్రవీణ్ కుమార్ 77శాతం, ఎం.అఖిల, జి.రెహనా సుల్తానా, డి.భాగ్యలక్ష్మి, ఎ.ఓంశేఖర్ 76శాతం, కె.వేదవ్యాస్, ఎస్.షాజియా, ఎం.విష్ణువర్ధన్‌బాబు 75శాతం, వీరితో పాటు మరెందరో మంచి ఫలితాలు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కరెస్పాండెంట్, ప్రిన్సిపల్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది విద్యార్థులను అభినందించి, మిఠాయిలను తినిపించారు.

పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించండి : పీడీ

ప్రజాశక్తి-బత్తలపల్లి

మామిడి మొక్కలు నాటుతున్న పిడి రామాంజనేయులు

ఉపాధి హామీ పనులతో పాటు పండ్ల తోటల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని డ్వామా పిడి రామాంజనేయులు సూచించారు. మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో శనివారం పండ్ల మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభోత్సవానికి పిడి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బత్తలపల్లి మండలంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో 53 మంది రైతులకు 147 ఎకరాల్లో చీనీ, మామిడి, దానిమ్మ సాగు చేసుకునేందుకు మొక్కలు మంజూరైనట్లు తెలిపారు. రైతులు 'సక్రమంగా పండ్ల తోటలను సంరక్షించుకొని లబ్ధి పొందాలని సూచించారు. రైతులకు రావాల్సిన బిల్లులు సకాలంలో చెల్లిస్తారని, అనుమానాలకు తావు ఇవ్వొద్దన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం వల్ల చాలా లబ్ధి చేకూరుతోందన్నారు. అనంతరం రైతులు సాగు చేసిన పండ్ల తోటలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎపిఒ కె.ఆదెప్ప, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, క్షేత్ర సహాయకులు రామకృష్ణ, రైతులు ఉన్నారు.

పాఠశాలను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ కార్తీక్

కెజిబివి తనిఖీ

పరిగి : స్థానిక కెజిబివిని శనివారం పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్ సందర్శించి విద్యార్థులకు అందించే భోజనం, గుడ్డు, కూరగాయల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం విద్యా బోధనకు రూ. కోట్లు సమకూరుస్తుందని వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉపాధ్యాయ బృందం పని చేయాలన్నారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మండల కేంద్రంలో అంబేద్కర్ భవణానికి స్థలం కేటాయించి నిధులు విడుదల చేయాలని కోరారు.

వేతనాలు చెల్లించాలని స్వీపర్ల వినతి

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి మున్సిపల్ స్కూళ్లలో పనిచేస్తున్న స్వీపర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, వేతనాలను నేరుగా స్వీపర్ల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ శనివారం స్కూల్ స్వీపర్స్ కార్మిక సంఘం(సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ హరిబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5 నెలల నుంచి వేతనాలు చెల్లించలేదని వాపోయారు. మున్సిపల్ అధికారులను కోరితే ఎంఈఓను సంప్రదించమని చెబుతున్నారని, విద్యాశాఖ అధికారులను సంప్రదిస్తే మాకు సంబంధం లేదని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి వేతనాలు చెల్లించ డంతో పాటు స్వీపర్లందరినీ రెగ్యులర్ చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్వీపర్లు ఇందిరమ్మ, గుల్జార్, చంద్రకళ, నరసమ్మ, ప్యారిజాన్, సిఐటియు నాయకులు జగన్మోహన్, ముస్తాక్, నారాయణ, ఫాజిల్, ఫిరోజ్ పాల్గొన్నారు.

టిడిపి మహిళా చైతన్య రథం ప్రారంభం

ప్రజాశక్తి-రొద్దం

టిడిపి మేనిఫెస్టో కరపత్రాలను పంచుతున్న పార్థసారధి

మండల పరిధిలోని రొద్దం గ్రామంలో శనివారం టిడిపి జిల్లా అధ్యక్షుడు బికె పార్థసారధి, ఆయన సతీమణి కమలమ్మ మహాశక్తి చైతన్య రథాన్ని ప్రారంభించారు. ముందుగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పార్టీ అధినేత చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోని వివరించారు. అలాగే వచ్చే ఎన్నికలలో బికె పార్థసారధిని ఎమ్మెల్యేగా, చంద్రబాబుని ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, అధికార ప్రతినిధి నరసింహులు, పెనుగొండ నియోజకవర్గ అధ్యక్షులు చిన్నప్పయ్య, మండల కన్వీనర్ నరహరి, శశిభూషణ్‌పటేల్, కన్వీనర్లు, సర్పంచులు, నాయకులు, తెలుగు మహిళలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికై విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి-హిందూపురం

విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈ నెల 25న రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఆయా విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని ఇందిరా పార్కులో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్ఎస్‌యుఐ సంపత్‌కుమార్, టిఎన్ఎస్ఎఫ్ అభి, అభిలాష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బంద్‌కు పిలుపునిచ్చామని, బంద్‌కు ప్రభుత్వ, ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు సహకరించి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరసింహమూర్తి, అమన్, దేవరాజ్, వేణుగోపాల్, పవన్, హరి, బాలాజీ, వినీత్, పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ఆర్భాటమే తప్ప అభివృద్ధి లేదు

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ

ప్రజాశక్తి-పెనుకొండ

వైసిపి హయాంలో ప్రచార ఆర్భాటమే తప్ప అభివృద్ధి లేదని టిడిపి రాష్ట్ర కార్యనికర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారంఆమె మాట్లాడుతూ వాలంటీర్లకు ఏ హక్కు ఉందని ప్రజల డేటా సేకరిస్తున్నారో వైసిపి ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. సిఎం జగన్ బూతులు తిట్టడం, వ్యక్తిగత జీవితాల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. సాక్షి పత్రిక, టీవీ ఛానల్, భారతి సిమెంట్, తదిరత కంపెనీలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. తల్లి, చెల్లిని మోసం చేసిన జగన్ బాబాయి హత్యను రాజకీయంగా వాడుకొని సిఎం అయ్యారని ఆరోపించారు. చంద్రబాబు, లోకేశ్, బాలయ్యను తిట్టడానికే సభలు పెట్టుకుంటున్నారంటూ వైసిపి ప్రభుత్వం, నాయకులపై మండిపడ్డారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, వెంకటరమణ, శ్రీనివాసులు, ఆంజనేయులు, రామకృష్ణారెడ్డి, నరసింహులు, సుబ్రహ్మణ్యం, త్రివేంద్రనాయుడు, మారుతిప్రసాద్, ప్రకాష్, సురేష్, శ్రీనివాసులు, హేమంత్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

నేతన్న నేస్తం లబ్ధి నామమాత్రమే : 'నిమ్మల'

ప్రజాశక్తి-గోరంట్ల

వైసిపి ప్రభుత్వంలో చేనేతలకు చేసింది శూన్యమని, 'నేతన్న నేస్తం' ద్వారా లబ్ధిదారులకు నామమాత్రంగా లబ్ధి చేకూరిందని మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప విమర్శించారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం ఆయన మాట్లాడుతూ నేతన్న నేస్తం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 80 వేల మందికి మాత్రమే లబ్ధి చేకూరిందన్నారు. చేనేతల అభివృద్ధి కోసం టిడిపి హయాంలో ఆప్కో సంస్థను ఏర్పాటు చేయడంతో పాటు రుణమాఫీ కూడా చేశామన్నారు. సిఎం జగన్ సంపద సృష్టించకుండా రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాడన్నారు. వస్త్ర వ్యాపారులపై దాడులు జరుగుతున్నా, దాడులు చేస్తున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం, ఎల్ఎన్ నారాయణస్వామి, శ్రీనివాసులు, రఘునాథ్‌రెడ్డి, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వాసుపత్రిలో దంత వైద్య సేవలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో వైద్య వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెం డెంట్ డాక్టర్ నజీర్, దంత వైద్యులు డాక్టర్ వివేక్ సూచించారు. ఆసుపత్రిలో శనివారం వారు మాట్లాడుతూ వారంలో సోమ, బుధ, శుక్రవారాల్లో (మూడు రోజులు) మాత్రమే దంత వైద్య చికిత్సలు నిర్వహిస్తామన్నారు. పుచ్చిపోయిన దంతాలు తొలగించుట, నూతన దంతాలు కట్టడంతో పాటు దంతాల సంరక్షణ పట్ల తీసుకోవా ల్సిన జాగ్రత్తలను వివరిస్తామన్నారు. అతి చల్లటి పదార్థాలు, కూల్‌డ్రింక్స్, స్వీట్లు ఎక్కువగా తినరాదని తెలిపారు. నాణ్యమైన దంత వైద్య చికిత్సలను కూడా అందిస్తామని తెలిపారు.

కేసుల భయంతోనే ఢిల్లీకి జగన్

మాజీ ఎమ్మెల్యే ఈరన్న

ప్రజాశక్తి-మడకశిర రూరల్

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న

కేసుల భయంతోనే తరచూ సిఎం జగన్ ఢిల్లీకి వెళ్లి నరేంద్ర మోడీని కలిసి వస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఈరన్న విమర్శించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, నారా లోకేష్‌పై ఎంపి గోరంట్ల మాధవ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సిఎం జగన్, ఎంపి గోరంట్ల మాధవ్ ఎపికి ప్రత్యేక హోదా అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు అడగలేకపోతు న్నారన్నారు. చంద్రబాబుతోనే ప్రత్యేక హోదా సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు అరుణ ఆదినారాయణ, ప్రకాష్, అశ్వత్థరామప్ప, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత విమర్శలు మానుకో..

మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి గ్రూపు రాజకీయాలు, వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని టిడిపి మాజీ ఎమ్మెల్యే ఈరన్న హితవు పలికారు. పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఈరన్న మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈరన్న మంచివ్యక్తి అని జిల్లా నాయకులకులందరికీ చెప్పిన తిప్పేస్వామి ఇప్పుడెందుకు అనుచరులను రెచ్చగొడుతున్నారని ప్రశ్నించారు. పార్టీలోని సీనియర్ నాయకుల మధ్య చిచ్చుపెట్టడం, విడగొట్టడం, అనుచరులతో మాట్లాడించడం అతడికి అలవాటుగా మారిందని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యేతో, అధికార పార్టీతో ఎవరు కుమ్మక్కయ్యారో ఆస్తులు సంపాదించుకున్నారో నియోజకవర్గ ప్రజల కు బాగా తెలుసు అన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు సైతం ఓ వర్గాన్ని పెంచి పోషించారని ఆరోపించాడు. పార్టీ అధినేత చంద్రబాబు ఎవ్వరికి టికెట్ ఇచ్చినా పార్టీ గెలుపునకు కృషి చేస్తానన్నారు. టిడిపిని వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆయనతో పాటు అరుణ ఆదినారాయణ, ప్రకాష్, అశ్వత్థరామప్ప, మెలవాయి శివ, గౌరీపురం అంజి, ఉన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం కదిరి బ్రాహ్మణపల్లి హైస్కూల్ మాశానం పేట, తలుపుల ఉబ్బరవాండ్లపల్లి హైస్కూల్‌లో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ రాధిక గుడ్ టచ్, బ్యాడ్ టచ్, యుక్త వయసులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బాలికలకు అవగాహన కల్పించారు. 18 ఏళ్ల కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, పండ్లు, పీచు, ఐరన్ సంబంధిత ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకుంటే రక్తహీనతకు గురి కాకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. బాగా చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలని, సత్ప్రవర్తనతో మెలిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రస్తుతం మహిళలకు రక్షణ కవచంగా ఉన్న 'దిశ' యాప్ ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నిహారిక, ప్రభావతి, మౌలాబి, రామలక్ష్మి, మమత , తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్ మానసిక రోగి

ప్రజాశక్తి-కదిరి టౌన్

జనసేనపార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యలపై మాట్లాడుతుంటే సిఎం జగన్ ఓ మానసిక రోగిలా ప్రవర్తిస్తున్నారని జనసేన పార్టీ నాయకులు భైరవ ప్రసాద్ విమర్శించారు. పట్టణంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ముఖ్యమంత్రి వైసిపి నాయకుడిగా మాట్లాడుతున్నారు తప్ప ఓ ప్రజాప్రతినిధిగా మాట్లాడటం లేదన్నారు. వాలంటీర్లు ప్రభుత్వ ఉద్యోగులా లేక మీ పార్టీ కార్యకర్తలా అనే విషయంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సిఎం జగన్‌తో పాటు వైసిపి నాయకులు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడితే బాగుంటుంది, వ్యక్తిగత విమర్శలు చేస్తే మేము కూడా మీ చీకటి బాగోతాలు బయటకు తోడాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సాకే రవికుమార్, భూక్యా రవీందర్‌నాయక్, కదిరి పట్టణ అధ్యక్షులు కాయల చలపతి, జిల్లా కార్యక్రమాల నిర్వహణ కమిటీ సభ్యులు లక్ష్మణ కుటాల, ఐటి వింగ్ కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్, భాస్కర్, లాయర్ రవి, హరిబాబు, అంజిబాబు, శ్రీనివాసులు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

తప్పులు సరిదిద్దేరా..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



రాబోయేది ఎన్నికల సమయం కావడంతో ఓటర్ల జాబితాపై పెద్ద కసరత్తే కొనసాగుతోంది. బోగస్ ఓటర్లను అధికార పార్టీ పెద్దఎత్తున చేర్చిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇందులో వలంటీర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ముందు నుంచి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వారిని ఓటర్ల జాబితా తయారీలో భాగస్వామ్యులు చేయకుండా తయారు చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు క్షేత్ర స్థాయిలో అమలుకు చర్యలు చేపట్టింది. ఈనెల 21వ తేది నుంచి నెల రోజుల పాటు ఓటర్ల జాబితా సరిదిద్దే కార్యక్రమాన్ని చేపట్టింది. బూత్ లెవల్ అధికారులతో మొత్తం ఇంటింటికీ ఓటర్ల జాబితాను పరిశీలించి తప్పిదాలేమైనా ఉంటే సరిచేయాలని నిర్ణయించారు. అయితే ఆచరణలో ఇది ఎంత మేరకు పకడ్బందీగా అమలు జరుగుతుందన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. అనంతపురం జిల్లా వరకు చూస్తే ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 19.38 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 9.68 లక్షల మంది పురుషులు, 9.68 లక్షల మంది మహిళలు, 224 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. 2197 మంది బిఎల్ఓలు తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ఓటర్లను చేరియాల్సి ఉంటుంది. ఇందులోనూ ఏవైనా సమస్యలుంటే తెలియజేయాలని ప్రారంభానికి ముందే రాజకీయ నాయకులను కోరారు. అయితే ఇది ప్రారంభానికి ముందే జిల్లాలోని అధికారపార్టీ నేతలూ ప్రత్యేకంగా రహస్య సమావేశాలు నిర్వహించారన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో గతంలో నిబంధనలకు విరుద్ధంగా ఓట్లు తొలగించారంటూ ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఉన్నతాధికారలకు ఆదేశించడం, ఎన్నికల ఉన్నతాధికారే జిల్లాకు వచ్చి విచారించిన సందర్భమూ ఉంది. అనంతరం కొంతమంది సిబ్బందిపై వేటు కూడా వేశారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు జరుగుతున్న ఓటర్ల జాబితా తయారీలో ఎలాంటి జాగ్రత్తలు సిబ్బంది పాటిస్తారన్నది చూడాల్సి ఉంది. ఇకపోతే ఈ వారంలో అధికారపార్టీ ఎన్నికలకు సమాయత్తమవుతున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లా ఇంఛార్జీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జిల్లాలో శనివారం నుంచి పర్యటన ప్రారంభించారు. ఈ పర్యటనలో రోజుకొక నియోజకవర్గంలో ఆయన పర్యటిస్తారు. ఇందులో జిల్లా ఉన్నతాధికారులందరూ సమావేశమై నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో ఏమైనా సమస్యలుంటే వాటి పరిష్కారాలను అక్కడే సూచిస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఈ స్థాయిలో సమీక్షలను ఇంచార్జీలు జరిపిన దాఖలాల్లేవు. ఏదైనా ఉంటే జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం నిర్వహించేవారు. అందులో జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులందరూ పాల్గొని ఏదైనా సమస్యలుంటే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేవారు. కాని తొలిసారిగా నియోజకవర్గ స్థాయిలో జరుపుడం అది కూడా ఎన్నికలు సమీస్తున్న సమయంలో జరపుతుండటం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఇదంతా ఎన్నికల కసరత్తులో భాగంగానే సాగుతోందన్నది స్పష్టమవుతోంది. ప్రతిపక్ష పార్టీ నాయకులు సమస్యలను ముందుకు తీసుకొచ్చి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేస్తున్నారు.

CHANGE OF NAME

DEVULA CHERUVU NARASH KUMAR (old Name) S/o DEVULA CHERUVU ANJINEYULU I have Changed my name **DEVULA CHERUVU NARESH KUMAR (New Name)** vide Affidavit dated 13-07-2023 sworn before notary by K.C.THIPPE NAIK, Advocate, PENUKONDA.

IN THE COURT OF SENIOR CIVIL JUDGE :PENUKONDA
I.A.No.522/2021 in O.S.No.59/2017

Between:
Vaddi Nagappa @ Penukonda Nagappa Died By LRs ...**Petitioner/Plaintiff**
And
Gorantla Obulesu and others ...**Respondent/Defendent**

NOTICE TO RESPONDENT NO :5

R 5: Aruna, Aged 32 yers, W/o Aswartha Narayana, Hindu, Agricultural Paipalli Village, Puttaparthi Mandal, Sri Sathya Sai District.

ఇందుమూలముగా మీకు తెలియజేయడం ఏమనగా పై నెంబరు దావాలోని 3వ ప్రతివాది గోరంట్ల ఓబులమ్మ చనిపోయినదున ఆమె వారుసులైన మిమ్మల్ని పై దావాలో ప్రతివాదులుగా చేర్చమని I.A.No:522/2021 అర్జీని దాఖలు చేసినారు. సదరు విషయములై నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల నీవు 25/07/2023 ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో ఖుద్దున గానీ వకీలు ద్వారా గానీ హాజరు అయి నీ వాదనలు తెలుపుకొనవలెను. లేని యెడల నీ పరోక్షమందు సదరి అర్జీని తీర్మానం చేయుదురని యిందు మూలముగా నీకు తెలియచేయటం అయినది.

(By Order Of the Court)

శ్రీ.ఎల్.విశ్వనాథ్ అడ్వకేట్, పెనుకొండ

ప్రజలకు చేరువగా సంక్షేమ ఫలాలు

'జగనన్న సురక్ష'లో నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా విజయం మాత్రం వైసిపిదే అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని గాంధీనగర్, బిడ్డప్పనగర్, ఆదర్శనగర్, నారాయణపురం, రుద్రంపేటలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా లబ్ధిదారులకు వివిధ ప్రభుత్వ సేవలకు సంబంధించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయన్నారు. అర్హత ఉండి వివిధ కారణాలతో రాకపోతే మళ్లీ వాటిని సరిదిద్ది పథకాల ప్రయోజనాలను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం కోసమే 'జగనన్న సురక్ష' క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతిసాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, జెసిఎస్ కన్వీనర్లు, కార్పొరేటర్లు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయదుర్గం : మండలంలోని టి.వీరాపురం గ్రామ సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసుకున్న వివిధ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో విప్ కాపు రామచంద్రారెడ్డి, జడ్‌పిటిసి మల్లికార్జున, సర్పంచి ఓబుళమ్మ, ఎంపిటిసి రాజమ్మ, నాయకులు అంజినేయులు, శివారెడ్డి, సచివాలయ కన్వీనర్ రఘు, సచివాలయ మండల కన్వీనర్ మురహరి, వార్డు వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంతోపాటు గూగూడు సచివాలయాల్లో శనివారం జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు. ఇందులో భాగంగా దరఖాస్తు చేసుకున్న పలువురికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సర్పంచులు మనీల సుప్రియ, రమణకుమారి, ఎంపిడిఒ పి.దివాకర్, తహశీల్దార్ సురేష్‌బాబు, ఇఒఆర్‌డి జి.లక్ష్మీనరసింహ, ఆర్‌ఐ జ్యోతిరాణి, పంచాయతీ కార్యదర్శులు అశ్వర్థనాయుడు, ఆనంద రాఘవ, శ్రీనివాసులు, ఉప సర్పంచి శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని వెల్లుట్ల, మడుగుపల్లి గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారికి ఉచితంగా వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మోహన్‌కుమార్, ఎంపిడిఒ యోగానందరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్‌ప్రసాద్, ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, ఆర్‌ఐ కిష్టప్ప పాల్గొన్నారు.

గుత్తి : ప్రభుత్వం అమలు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు సత్వర సేవలు లభిస్తున్నాయని మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, కమిషనర్ జి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ప్రజాప్రతినిధులు, అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ బి.వరలక్ష్మి, కౌన్సిలర్ షేక్ నజీర్, మున్సిపల్ మేనేజర్ మురళీధర్, ఎఇ సాయినాథ్‌బాబు, ఆర్‌ఐలు రామాంజనేయులు, షెక్షావలి, వైసిపి నాయకులు అశ్వ చిన్న మారెన్న, ఎ.దస్తగిరి, ఎం.రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరం అని ఎంపిడిఒ నిర్మలాకుమారి తెలిపారు. శనివారం మండల పరిధిలోని తరిమెల సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, పెద్దిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తహశీల్దార్ ఈశ్వరమ్మ, ఎఇ అన్వేష్‌కుమార్, సర్పంచి ఓబులేసు, ఎంపిటిసిలు ఎన్‌వి.నారాయణ, విఆర్‌ఒ నవీన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : వైసిపి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్న సురక్ష' గ్రామ సభలకు విశేష ఆదరణ లభిస్తుందని ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తవలంమర్రి గ్రామ సచివాలయంలో శనివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు మీ ఇంటి వద్దకే వచ్చి 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తారని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి రమణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, లక్ష్మీపతియాదవ్, మాజీ సర్పంచి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే మండల పరిధిలోని కొండకమర్ల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందాయా అని ఆరా తీశారు. అలాగే వారి సమస్యలు తెలుసుకొని సాధ్యమైన వాటిని అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రామనాథ్ రెడ్డి, జడ్పిటిసి కుర్లి దామోదర్‌రెడ్డి, ఎంపిపి పర్వీన్‌బాను, మండల కన్వీనర్ రాజునాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీనివాసులు, సర్పంచులు గోవిందు, వెంకటరమణ, జగన్మోహన్‌చౌదరి, రామచంద్రారెడ్డి, అల్లపల్లి శ్రావణి, రంగారెడ్డి, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి షామీర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండల పరిధిలోని బూరుగుపల్లి గ్రామ సచివాలయంలో నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ఎంపిడిఒ అంజనప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం అధికారులు రెడ్ సంస్థ సభ్యులతో కలిసి బాల్య వివాహం చేయ డం వల్ల కలిగే అనర్థాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి వెంకట నారాయణ, సర్పంచి భాస్కర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్, వైసిపి నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తప్పెటవారిపల్లి, మల్లేపల్లి గ్రామాల్లో నిర్వహించిన 'జగనన్న సురక్ష' గ్రామసభల్లో తహశీల్దార్ నాగేంద్ర, ఎంపిడిఒ విజయలక్ష్మి, ఈఓఆర్‌డీ ఖాదర్‌బాషా, జడ్పిటిసి తిరుమల సేవేనాయక్, ఆయా గ్రామాల సర్పంచులు, వైస్ ఎంపిపి వెంకటరెడ్డి , వెంకటకృష్ణారెడ్డి, వెంగమని, గంగిరెడ్డి, కిష్ట, చంద్ర, రామచంద్ర, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సిరిగారిపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపిటిసి గంగులప్పకు రూ. 15వేలు అందజేశారు.

బత్తలపల్లి : ప్రజలందరికీ పూర్తిస్థాయిలో మేలు చేయాలన్న దృఢ సంకల్పంతో సిఎం జగన్ 'జగనన్న సురక్ష'కు శ్రీకారం చుట్టారని ఎంపిపి బగ్గిరి త్రివేణి, జడ్పిటిసి కోటి సుధ పేర్కొన్నారు. మండల పరిధిలోని పోట్లమర్రి గ్రామ సచివాలయంలో సర్పంచ్ అక్కెం డామోదర్ అధ్యక్షతన 'జగనన్న సురక్ష' గ్రామసభ నిర్వహించా రు. ముఖ్య అతిథులుగా ఎంపిడిఒ సౌజన్యకుమారి, ఈఓఆర్‌డి దివాకర్, సిఎస్‌డిటి శారద, ఎంపిటిసి తప్పెట ఆంజనేయులు, వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డి హాజరై ప్రజలకు వివిధ ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఈశ్వరయ్య, ప్రకాష్, ఉప సర్పంచి కృష్ణారెడ్డి, వైసిపి నాయకులు చంద్రమోహన్, కాటమయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : 'జగనన్న సురక్ష'లో ప్రజల సమస్యలు పరిష్కరిస్తారని డిఎల్‌డిఒ శివారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మీర్జాపురం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సిద్ధారెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ స్వాతి, ఎఇ నటరాజు, ఎపిఒ నాగిరెడ్డి, హౌసింగ్ ఎఇ రమణారెడ్డి, ఎంపిపి గాయత్రి రెడ్డప్పరెడ్డి, సర్పంచి చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : 'జగనన్న సురక్ష' ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని ఎంపిపి ఎవి.రమణారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శుభదాస్, ఎంపిడిఒ అశోక్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, వైస్ ఎంపిపి హనుమంతరెడ్డి పాల్గొని వంద మందికి పైగా ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక 'జగనన్న సురక్ష' కార్యక్రమమని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, కౌన్సిలర్లు మేడాపురం వెంకటేష్, రాయపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం ఎర్రగుంట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎల్‌సికె పురం, పార్థసారథినగర్ ప్రజలకు, శ్రీనివాస కళ్యాణ మండపంలో రాంనగర్, తారకరామాపురం ప్రజల కోసం 'జగనన్న సురక్ష' సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ ఛైర్మన్ వేముల జయరామిరెడ్డి కౌన్సిలర్లు మాట్లాడుతూ సంక్షేమ పథకాలే కాకుండా ప్రజల సమస్యలు, అవసరాలను గుర్తించి పరిష్కార దిశగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అనంతరం వారు 4,694 సర్టిఫికెట్లను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఆనంద్, టిపిఆర్‌ఓ సుబ్బరాయుడు, వార్డు కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

లేపాక్షి : 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి సిఎం జగన్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించారని హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపికవేణు పేర్కొన్నారు. సర్పంచి నందిని ఆధ్వర్యంలో ఎంపిపి వెంకటరత్నమ్మ అధ్యక్షతన చోళసముద్రంలో నిర్వహించిన గ్రామసభలో దీపికవేణు ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి శ్రీనివాసరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ నారాయణస్వామి, వైస్ ఎంపిపి అంజనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : మండల పరిధిలోని వీరాపురంలో సర్పంచి లక్ష్మీపతిరెడ్డి అధ్యక్షతన 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఎంపిపి పురుషోత్తమరెడ్డి పాల్గొని ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోడూరు సర్పంచ్ మురళీ, వైసిపి నాయకులు రామకృష్ణా రెడ్డి, సూర్యనారాయణ, శంకర్‌రెడ్డి, హరి, సుధాకర్, శెట్టిపల్లి రవీంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

గ్రంథాలయం పరిశీలన

గాండ్లపెంట : స్థానిక గ్రంథాలయాన్ని శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ సందర్శించి రికార్డులను పరిశీలించారు. అలాగే పాఠకుల హాజరు, పుస్తకాలు, తదితర వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలో పాఠకులకు అవసరమైన పుస్తకాలు, దినపత్రికలు అందుబాటు లో ఉంచాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పర్వీన్‌బాను, పాఠకులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయురాలికి సన్మానం

లేపాక్షి : మండలం పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీ గ్రామస్తులకు పేరుపేరునా ధన్యవాదాలు. అక్కడ ఎనిమిదేళ్ల పనిచేసిన తన పట్ల ఎంత గౌరవం చూపించిన తీరు మరువలేనిది ఈరోజు గ్రామస్తులు ప్రాథమిక పాఠశాలకు పిలిపించి సన్మానించడం పట్ల కతజ్ఞతలు, సర్పంచ్ నాగేంద్రకు విద్యార్థులు తల్లిదండ్రులు మిడ్ డే మీల్స్ ఏజెన్సీ నిర్వాహకులు ఉపాధ్యాయులు ప్రజలు ప్రజ అభిమానాన్ని ఎప్పటికీ మరువను కతజ్ఞలు తెలియజేసిన సుధా ఎస్జీ టీచర్ ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు పాల్గొన్నారు

పర్యావరణ పరిరక్షణ బాధ్యత విద్యార్థులదే

కొత్తచెరువు రూరల్ : భవిష్యత్తు తరాల కోసం నేటి విద్యార్థులు పర్యావరణాన్ని పరిరక్షించడంలో ప్రముఖ భూమిక పోషించాలని పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు సూచించారు. మండల పరిధిలోని తలమర్ల ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రతి విద్యార్థి బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షిస్తే భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేసిన వారవుతారని తెలిపారు. అనంతరం ఆయన్ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

24న ధర్నాను జయప్రదం చేయండి

ధర్మవరం టౌన్ : ఏపి రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఈ నెల 24వ తేదీ కలెక్టరేట్ ముందు చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెవి రమణ పిలుపునిచ్చారు. పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు ఎకరాకి రూ. 10వేల సాగు సాయం, రుణ విముక్తి చట్టం, రైతుల పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల బిగించరాదని, 50 ఏళ్ల నిండిన రైతుకు రూ. 10వేల పింఛన్, ఉపాధి హామీ వ్యవసాయానికి అనుసంధానం, తదితర డిమాండ్లతో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

గాండ్లపెంట : స్థానిక పోలీస్ స్టేషన్‌ను శనివారం డిఎస్‌పి ఎం.శ్రీలత సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్యాక్షన్ గ్రామాల్లో గట్టి నిఘా ఉంచాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే మండలంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని ఎస్ఐ బి.మల్లికార్జునరెడ్డికి సూచించారు. కార్యక్రమంలో జమేదార్లు రామయ్య, శ్రీనివాసులు. సిబ్బంది నాగరాజు, భాస్కర్, రాజు, బాలాజీనాయక్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతోనే మంచి భవిష్యత్తు

పెనుకొండ : పట్టణంలోని శ్రీసత్య సాయి డిగ్రీ కళాశాలలో శనివారం ఫేర్వెల్ డే ఘనంగా జరిగింది. తొలుత సరస్వతి పూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు సమావేశంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిశేషారెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ తో కూడిన విద్యతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని హితబోధ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అశోక్‌కుమార్, అధ్యాపకులు వినోద్, సంధ్య, నవీన్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

విరివిగా చెట్లు పెంచడమే గ్రీన్ భారత్ లక్ష్యం

పుట్టపర్తి రూరల్ : జిల్లా వ్యాప్తంగా బంజరు భూములు, కొండ, గుట్టల్లో విరివిగా చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడటమే గ్రీన్ భారత్ ముఖ్య ఉద్దేశమని సంస్థ అధ్యక్షులు రెడ్డివారి శంకరనారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని జగరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పదేళ్లలో ప్రకృతి వ్యవసాయంపై మరో హరిత విప్లవం తీసుకురావడం, ప్రతి రైతును ఆదుకోవడం గ్రీన్ భారత్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

ఇంటింటా ఓటరు జాబితా పరిశీలన

పుట్టపర్తి రూరల్ : నెల రోజుల పాటు ఇంటింటా ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో బూత్ స్థాయి అధికారుల చేత ఇంటింటా ఓటర్ల జాబితా పరిశీలన సర్వే నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. డబుల్ ఓటర్లు, చనిపోయిన ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లు తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో సిఎస్‌డిటి షబ్బం, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ కె.నరసింహులు, వీఆర్వోలు, సచివాలయం మహిళా పోలీసు పాల్గొన్నారు.

మండల పరిషత్ పరిపాలనాధికారి నియామకం

ప్రజాశక్తి-మడకశిర

రొళ్ల మండల పరిషత్ పరిపాలన అధికారిగా ప్రసాద్‌ను జిల్లా పరిషత్ అధికారులు నియమించారు. పెనుకొండ పంచాయతీరాజ్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రసాద్‌ను పదోన్నతి ఇక్కడికి బదిలీ చేశారు. ఈయన గతంలో మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామికి పిఎగా పనిచేశారు. పదోన్నతి పొందిన ప్రసాదకు జిల్లా పరిషత్ ఛైర్మన్ గిరిజమ్మ నియామక పత్రాలు అందజేశారు.